క్లుప్తంగా

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు



కుర్చీలు, టేబుళ్లను స్వాధీనం చేసుకుంటున్న పోలీస్ సిబ్బంది

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలసలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. 13 మంది పేకాటరాయుళ్లను పట్టుకుని, కేసు నమోదు చేశారు. అనంతరం వారి నుంచి రూ.54,320లు, కుర్చీలు, టేబుళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా, పేకాటశిబిరం నిర్వహిస్తున్న ఇంటి యజమానిపై కూడా 34యాక్ట్ కింద కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వి.ప్రసాదరావు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు



జావాం నీళ్ల ట్యాంకు వద్ద పహారా కాస్తున్న సిబ్బంది

సంతకవిటి: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కల్యాణ చక్రవర్తి హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని నాగావళి నదీతీరాల్లో వీఆర్‌వో, వీఆర్‌ఏలతో రాత్రి సమయాల్లో గస్తీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎక్కడైనా ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు.

అగ్నిఅస్త్రంతో చీడ పీడల నివారణ



అగ్నిఅస్త్రం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సంతకవిటి: అగ్నిఅస్త్రంతో చీడపీడలు నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ తెలిపారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. వివిధ ఆకులు, ద్రావణాలతో తయారు చేసుకున్న అగ్నిఅస్త్రాన్ని పంటలపై పిచికారీ చేయడం ద్వారా కత్తెరపురుగు, కాండంతొలుచు పురుగుల బెడద నుంచి పంటను కాపాడవచ్చన్నారు.

ఆకట్టుకున్న దీప వినాయకుడు



సంప్రదాయ దీపాలతో తయారు చేసిన వినాయక ప్రతిమ ఆకృతి

తెర్లాం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పెరుమాళి గ్రామంలో నగరాల వీధిలో వినాయక మండపం వద్ద మహిళా భక్తులు 1001 సంప్రదాయ దీపాలతో ఆదివారం చేసిన గణేశుని ప్రతిమ ఆకారం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. దీపపు కాంతితో మెరిసిపోతు న్న గణనాథుడిని చూసేందుకు భక్తులు పోటీపడ్డారు.

మోక్ష ప్రదాయిని భగవద్గీత



భగవద్గీత గొప్పతనం వివరిస్తున్న వక్తలు

రేగిడి: హిందువుల పవిత్ర గ్రంథమైన భగవద్గీత మోక్ష ప్రదాయిని అని, ప్రతిఒక్కరూ భగవద్గీత చదవాలని ఆధ్యాత్మిక వక్తలు రామ్మోహనరావు, త్రినాథరావు, దామోదరరావు అన్నారు. మండలంలోని దేవుదల గ్రామంలోని గీతాశ్రమంలో భగవద్గీత పఠనం ఆదివారం చేపట్టారు. భగవద్గీత చదివినా, వినినా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సమయం కేటాయించాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

అన్నదానం

తెర్లాం: మండలంలోని అరసబలగ గ్రామంలో రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ కొరగంజి సాయిరాం ఆధ్వర్యంలో నగరాల యూత్ సభ్యులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయగా, గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన అనేక మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు.

వంగర: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని శివ్వాం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమానికి తరలివచ్చి, స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు.

‘సూపర్ సిక్స్’ అమలెప్పుడు?

- ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: సూపర్ సిక్స్ పేరిట ప్రజలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయు డు ప్రశ్నించారు. ఇదే విషయమై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. మోసపూరిత హామీలు ఇచ్చి, అన్ని వర్గాల ప్రజలకు చంద్రబాబు సర్కారు ద్రోహం చేస్తోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మొదటి రెండు నెలల్లో సంక్షేమ పథకాల అమలులో జాప్యం కోసం ఒక్కో శాఖపై సమీక్ష, శ్వేతపత్రం విడుదల చేసి, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నించారని ధ్వజమెత్తారు. ఇప్పుడు విజయవాడ వరదల పేరుతో మరి కొన్నాళ్ల పాటు పథకాల అమలును ఆలస్యం చేయాలని చూస్తున్నారని, ప్రజలంతా గమనించాలన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ క్యాలెండర్ రూపొందించి మరీ ఏ తేదీకి ఏ పథకం ఇస్తారో స్పష్టంగా తెలియజేసి మరీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా తల్లికి వందనం పథకం ఊసే లేదన్నారు. మరోవైపు ఖరీఫ్ సాగు పనులు జరుగుతున్నా ఇంత వరకు అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు వేయలేదని మండిపడ్డారు. పంటల బీమాను కూడా గాలికొదిలేశారన్నారు. ప్రజలంతా ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారా అని ఎంతో ఆశగా చూస్తున్నారన్నారు. విజయవాడ వరద సహాయక చర్యల్లో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వరదలు వస్తాయని తెలిసి కూడా ప్రజలను అప్రమత్తం చేస్తూ కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రజలను పక్కదోవ పట్టించే రాజకీయాలు మానుకోవాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని లేకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పార్టీ బొబ్బిలి మండల ప్రెసిడెంట్ ఉత్తరావల్లి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాసింజర్ రైళ్లు నడపాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకరరావు

బొబ్బిలి: స్థానిక రైల్వేస్టేషన్ మీదుగా విశాఖపట్టణానికి అదనంగా మరిన్ని పాసింజర్ రైళ్లు నడపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు, మండల కార్యదర్శి సింగిరెడ్డి గోపాలం డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు, తదితరులు నిత్యం విశాఖపట్నానికి రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. సరిపడ పాసింజర్ రైళ్లు లేకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విశాఖపట్నం, దుర్గ్ ప్రాంతాల మధ్య వేసిన కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు బీజేపీ పాలిత రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌కు మాత్రమే ఉపయోగపడేలా ఉందని, దీని బట్టి ప్రధానమంత్రి మోదీకి ఉత్తరాంధ్ర అంటే ఎందుకు అంత చిన్నచూపో అర్థం అవుతోందన్నారు. అన్నిచోట్ల తిరుగాడుతున్న రైళ్లలో సాధారణ బోగీల సంఖ్య పెంచాలని, అవసరమైన ప్రాంతాల్లో పాసింజర్ రైళ్లు నడపాలని విజ్ఞప్తి చేశారు.

22న ప్రత్యేక కళాప్రదర్శనలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నంబియార్

బొబ్బిలి: మున్సిపల్ ఆడిటోరియంలోని శ్రీకళాభారతి క్షేత్రంలో ఆనందో బ్రహ్మ పేరిట ప్రత్యేక కళాప్రదర్శనలు ఈ నెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు శ్రీకళాభారతి ప్రధాన కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు తెలిపారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆనందో బ్రహ్మ సభ్యులు ఎం. విజయమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

30 వేల ధర పలికిన వినాయక లడ్డూ



రూ.30 వేలకు దక్కించుకున్న లడ్డూతో భక్తుడు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని మారుతీనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద ఉంచిన మూడు లడ్డూలను ఆదివారం వేలం వేశారు. ఈ వేలంపాటలో కాలనీకి చెందిన రౌతు సతీష్ రూ.30 వేలకు ఒకటి, కోడిశ శారద రూ.21 వేలకు మరొకటి, కమిటీ కుర్రోళ్లు రూ.15లకు ఇంకొక లడ్డు దక్కించుకున్నారు. అనంతరం వినాయకుడి ప్రతిమలను అన్ని వీధుల్లో ఊరేగించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి అన్నారు. స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ‘మానవ తప్పిదాల వల్ల ఏర్పడే ప్రకృతి విపత్తులు–నివారణ చర్యలు’ అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలకు 200 మంది విద్యార్థులు హాజరై, ప్రతిభ కనబరిచారు. వక్తృత్వ పోటీల్లో గెంబలి మనోహర్, సింహాద్రి సాయిశ్రీ చరిష్మాలు విజేతలుగా నిలవగా, వారికి బహుమతులతో పాటు సర్టిఫికెట్‌లను అందించారు. వ్యాసరచన పోటీల విజేతలను ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత కలిసి గ్రామాల్లోని అందరికీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ మాట్లాడుతూ విపరీతమైన ప్లాస్టిక్ వినియోగంతో ఎన్నో అనర్థాలు తలెత్తుతున్నాయని, ఇప్పటికైనా ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా ఉష్ణపాతాన్ని తగ్గించవచ్చన్నారు. మొక్కలు నాటే కార్యక్రమం ఓ ఉద్యమంలా సాగాలని, లేకుంటే మనం పీల్చేగాలి సైతం కొనుక్కోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. కార్యక్రమంలో వికాస తరంగి ణి సభ్యులు వాకచర్ల పైడిరాజు, మురపాక గణేష్, గడే అప్పలనాయుడు, అమనాన నీలకంఠం, మహంతి సత్యనారాయణ, లలిత, గెడ్డాపు శ్రీలక్ష్మి, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాంబయ్య

బొబ్బిలి: ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య, ఎస్సీ ఉద్యోగుల సంఘ నాయకుడు డాక్టర్ కొలు చిరంజీవులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పట్టణంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బైక్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. తొలుత వారు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం మాట్లాడారు. రాజకీయంగా బలపడేందుకు, ఐక్యంగా ఉన్న ఎస్సీల మధ్య చిచ్చు పెట్టేందుకే వర్గీకరణ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. ఎస్సీలంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు. మనమంతా ఐక్యంగా ఉంటేనే మన హక్కులను కాపాడుకోగలమన్నారు. రిజర్వేషన్ల పేరిట మనల్ని విడదీసే కుట్ర జరుగుతోందని, తెరవెనుక జరుగుతున్న దానిని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో బొక్కేన రాము, యండ గోపాల్, బి.శ్రీనివాసరావు, పి.సూర్యనారాయణ, డి.గోపాలం, మురళి, జగదీష్, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆందోళన



కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

బొబ్బిలి: పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఆదివారం తరగతులు నిర్వహిస్తుండడాన్ని వ్యతిరేకిస్తూ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆందోళకు దిగింది. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, మణికుమార్‌లు మాట్లాడుతూ సెలవు రోజు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించడమనేది విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. సొంత అజెండాతో తరగతుల నిర్వహణ సరికాదన్నారు. ఇలాంటి చర్యలకు పదేపదే ప్రయత్నిస్తున్న యాజమాన్యాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇదే పరిస్థితి పునరావృతమైతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు నాగరాజు, జాని, యోగి, సాయిమణి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో అపార జ్ఞానం



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: పుస్తక పఠనం ద్వారా మనకు అపారమైన జ్ఞానం వస్తుందని, ప్రతిఒక్కరూ ప్రాథమిక స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో పుస్తక పఠనం ఏ విధంగా చేయాలో లైబ్రేరియన్ నేర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ పుస్తకాలు, వార్తాపత్రికలు, వార, మాసపత్రికలు, ఇతిహాస గ్రంథాలు, నీతికథల పుస్తకాలు చదివి, అందులోని మంచి విషయాలను గ్రహించాలని తెలిపారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో కూడా పాల్గొనేందుకు ఆసక్తి కనబరచాలన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని లైబ్రేరియన్ కోరారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు


రేగిడి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అంబకండి గ్రామంలో గణనాథుని మండపం వద్ద మహిళలు ఆదివారం కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తాము తలపెట్టే ఏ కార్యక్రమంలోనూ విఘ్నాలు లేకుండా చూడాలని గణేశుడిని వేడుకున్నారు. మండలంలోని ఖండ్యాం, రేగిడి, అంబకండి, వన్నలి, సంకిలి తదితర గ్రామాల్లోని గణేశుని మండపాల్లో ప్రత్యేకాభిషేకాలు చేశారు.

రాజాం: మండలంలోని పొగిరి గ్రామంలో స్టార్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న గణపతి ఉత్సవాల్లో ఆదివారం దీపారాధన చేశారు. 10,108 సంప్రదాయ దీపాలు వెలిగించి, విఘ్నేశ్వరుడిని ఆరాధించారు.

సందడిగా గణేశుని నిమజ్జనోత్సవం

రామభద్రపురం/సంతకవిటి/రేగిడి: మండలాల్లోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవం ఆదివారం సందడిగా జరిగింది. తొలుత గ్రామ వీధుల్లో విగ్రహాలు ఊరేగించగా, ఊరేగింపు ఆద్యంతం డీజే పాటకు యువకులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. నిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



బొబ్బిలి సంస్థానం పాఠశాల పూర్వ విద్యార్థులు

బొబ్బిలి: మండల కేంద్రంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో స్థానిక పట్టణానికి చెందిన సంస్థానం ఉన్నత పాఠశాల 1986–87 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు ఆనాటి తీపి జ్ఞాపకాలను ఒకరినొకరు గుర్తుచేసుకుని సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను వారు సత్కరించారు. కార్యక్రమంలో రమేష్, సల్మాన్‌రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది వేగావతి నదీతీరం నుంచి యథేచ్ఛగా ఇసుక రవాణా జరుగుతోంది. ఓ వైపు ప్రభుత్వం ఇసుక నిల్వలు లేకపోవడం కారణంగానే ఉచిత ఇసుక సరఫరా చేయలేకపోతున్నామని చెబుతుంటే.. ఇక్కడి నుంచి మాత్రం కొంతమంది అక్రమార్కులు కావాల్సినంత ఇసుకను సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పారదర్శకంగా ఉచిత ఇసుక సరఫరాను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



పారాదిలో వేగావతి నది వద్ద ఇసుక లోడుతో ఉన్న నాటుబళ్లు

గొప్ప పోరాటయోధుడు ఏచూరి



రాజాం సిటీ: ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆశ కార్యకర్తలు, తదితరులు



బొబ్బిలి రూరల్: ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

రాజాం సిటీ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం గొప్ప పోరాటయోధుడని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు కొనియాడారు. మండల కేంద్రంలో ఆశ కార్యకర్తల యూనియన్ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆదివారం నివాళులర్పించారు. అనంతరం ఆయన కార్మిక, కర్షక వర్గాల సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేసిన తీరును ప్రశంసించారు. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర సమన్వయ రథసారధిగా దేశ ప్రజానీకానికి ఏచూరి అందించిన సేవలు అమోఘమన్నారు. విద్యార్థి దశ నుంచి మూడు దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలకు ఆయన ఊపిరి పోశారని, ఆయన మరణం కష్టజీవులకు తీరనిలోటన్నారు. ఆయన నుంచి ఎంతో నేర్చుకోవాలని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయడమే ఆయనకు మనమిచ్చే అసలైన నివాళి అన్నారు. కార్యక్రమంలో సూర్యమణి, పార్వతి, రవణమ్మ, చిన్నమ్మడు, రాణి పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని వెంకట్రాయుడుపేట, బొడ్డవలస గ్రామాల్లో ఏచూరి సీతారాం చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్మికులు, రైతులు, బడుగుల పక్షాన ధైర్యంగా పోరాటం చేసి, వారి అభ్యున్నతికి పాటుపడిన గొప్ప వ్యక్తి ఏచూరి అని, ఆయన లేనిలోటు పార్టీకి, కార్మిక, కర్షక, బడుగు వర్గాలకు తీరనిలోటు అన్నారు. కార్యక్రమంలో మండల సీపీఎం కార్యదర్శి సింగిరెడ్డి గోపాల్, శకుంతల, రమణమ్మ, కళావతి తదితరలు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం



తెర్లాం రోడ్డు మీదుగా వెళ్తున్న భారీ వాహనం

తెర్లాం: మండల కేంద్రం మీదుగా భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరదలకు పారాది వంతెన కొట్టుకుపోవడంతో బొబ్బిలి నుంచి రామభద్రపురం వైపు వెళ్లే వాహనాలతో పాటు రామభద్రపురం నుంచి బొబ్బిలి మీదుగా పార్వతీపురం వెళ్లే భారీ వాహనాలు తెర్లాం రోడ్లు మీదుగా వస్తున్నాయి. దీంతో తెర్లాం రామమందిరం వద్ద కల్వర్టు పూర్తిగా మరమ్మతులకు గురైంది. భారీలోడులతో వస్తున్న లారీల కారణంగా రోడ్లు, కల్వర్టులు పాడైపోతున్నాయని, ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజాం నుంచి రామభద్రపురం వైపు వెళ్లే వాహనాల కారణంగా మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం దాటిన తర్వాత రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. ఇటీవల కొన్ని లారీలు కూడా ఆ దారిలో బోల్తాపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికై నా ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీసులు స్పందించి, భారీ వాహనాలను మళ్లించే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన హిందీ పరీక్షలు



పరీక్షలు పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

రాజాం: మండలంలోని పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ, చెన్నైకు సంబంధించిన హిందీ పరీక్షలు ఆదివారం ముగిశాయి. గత రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయని హిందీ ప్రచారక్ కె.మధుసూధనరావు తెలిపారు. రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలు జరిగాయని, మొత్తం 187 మంది విద్యార్థులకు గాను 182 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఆదివారం జరిగిన పరీక్షలను ఎంఈవో యాగాటి దుర్గారావు పరిశీలించారు. పరీక్షల నిర్వహణ, సదుపాయాలపై ఆరా తీశారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా మధుసూదనరావు, ఇన్విజిలేటర్లుగా బలరామ్మూర్తి, రమణ, ఉమామహేశ్వరరావు, నాయుడు, నారాయణరావులు వ్యవహరించారు. రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి, జి.సిగడాం, తెర్లాం, చీపురుపల్లి ప్రాంతాల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.